## క్లుప్తంగా

### రేపు సర్వసభ్య సమావేశం

చిలప్‌చెడ్(నర్సాపూర్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ వినోదారెడ్డి, ఎంపీడీఓ ఆనంద్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు ప్రారంభవుతుందన్నారు. సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తి సమాచారంతో కచ్చితంగా హాజరుకావాలని ఆదేశించారు.

### ప్రహరీ నిర్మిస్తాం:ఎంపీటీసీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆంజనేయులు గౌడ్

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఖాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మిస్తామని ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం ఆయన పాఠశాలను సందర్శించారు. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు విన్నవించారు. దీనికి ఆయన స్పందించి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి త్వరలో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యాదగిరి గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మట్టి తవ్వకాలపై అభ్యంతరం

శివ్వంపేట(నర్సాపూర్): చెరువులో తమ ఇష్టానుసారం మట్టి తవ్వకాలు చేపట్టడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ శివ్వంపేట పంచాయతీ పరిధిలోని నాగయ్య చెరువులో జేసీబీ సహాయంతో మట్టితవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని వాపోయారు. తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతల వల్ల ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఓ స్థానిక రైతు పొలంలో నల్లమట్టి కోసం ఇరిగేషన్ శాఖ అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### చికిత్స కోసం ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదంలో గాయపడ్డ ఓ వ్యక్తికి చికిత్స కోసం జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా శనివారం ఆర్థిక సాయం అందజేశారు. శివ్వంపేటకు చెందిన భిక్షపతి ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆయన బాధితుడిని పరామర్శించి మెరుగైన చికిత్స కోసం రూ.10వేలు అందజేశారు. కష్టాల్లో పేదలను ఆదుకుంటానని మహేశ్ గుప్తా చెప్పారు. ఆయన వెంట శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

### బ్రెడ్లు, పండ్లు పంపిణీ



వృద్ధురాలికి పండ్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె తదితరులు

నర్సాపూర్: శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ దివంగత బీవీ రాజు వర్ధంతిని పురస్కరించుకుని పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, మేనేజర్ బాపిరాజు, ఏఓ సురేశ్, సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, విజన్ ఓల్డేజ్ హోంలోని పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రతినిధులు దివంగత బివిరాజు సేవలను గుర్తు చేసుకున్నారు.

### ఘనంగా భవానీమాత ఆలయ వార్షికోత్సవం

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ పోమ్యానాయక్ తండాలో భవానీమాత ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్ భవానీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సయ్యద్ ఫహీం, కాంగ్రెస్ నాయకులు దేవదాస్, లతీఫ్, సత్యగౌడ్, బాల్‌రెడ్డి, బాగవాన్ చాంద్, శివకుమార్, రాఘవేందర్, శంకర్, పండరి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ.. ఎప్పుడు కొనసాగేది

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. విద్యార్థులు కళాశాలల్లో ఆనందంగా అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్న సమయం. చాలా కళాశాలల్లో ఇప్పటికే సందడి మొదలైంది. అడ్మిషన్ల కోసం చాలాచోట్ల అధ్యాపకులు, సిబ్బంది కృషిచేస్తున్నారు. కాని కొన్ని విద్యాలయాలు మాత్రం అందుకు నోచుకోవడంలేదు. కారణాలేవైనా బాధ్యతగా ఉండాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యార్థులు నష్టపోయే అవకాశం ఎక్కువ.

– అల్లాదుర్గం(మెదక్):

- పూర్తికాని కళాశాల భవనం
- నాలుగేళ్లుగా సాగుతూనే ఉన్న పనులు
- పాత భవనానికీ మరమ్మతులు
- ప్రారంభంకాని తరగతులు
- పత్తాలేని లెక్చరర్లు, సిబ్బంది



పనులు కొనసాగుతున్న కేజీబీవీ కళాశాల భవనం

ప్రభుత్వం కళాశాల్లో జూన్ 1నుంచి తరగతులు ప్రారంభించాలని ఆదేశించింది. కేజీబీవీ, రెసిడెన్షియల్ మొదటి సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభించాలని తెలిపింది. కాని అల్లాదుర్గం కేజీబీవీ కళాశాలలో అందుకు విరుద్ధంగా ఉంది. సిబ్బంది, లెక్చరర్లు ఇంకా విధులకు హాజరు కావడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రారంభం ఎప్పుడో..**

అల్లాదుర్గం కేజీబీవీ కళాశాల భవన నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం రూ.2కోట్ల 5లక్షల మంజూరు చేసింది. ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. అతడికి అధికారులు ఎన్ని సార్లు నోటీసులు జారీచేసినా ఫలితం లేదనే విమర్శలున్నాయి. నాలుగున్నర ఏళ్లగా భవనం పనులు పూర్తికాలేదు. ఇప్పుడు చివరి దశ పనులు జరుగుతున్నాయి.



అడ్మిషన్ల కోసం చూస్తున్న పాఠశాల సిబ్బంది

**తరగతులు ఎక్కడ నిర్వహించాలి..**

అలాగే పాఠశాల భవనానికి కూడా చిన్నచిన్న మరమ్మతులను చేపట్టేందుకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కళాశాల భవనం పనులు చివరి దశకు చేరుకున్నా ప్రారంభించేది ఎప్పుడో తెలియని పరిస్థితి. దీంతో తరగతులు ఎక్కడ నిర్వహించాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. కేజీబీవీ పాఠశాల ప్రాంభమయ్యేలోగా పనులు పూర్తవుతాయో లేదో వేచి చూడాల్సిందే. కళాశాల భవనం, పాఠశాల మరమ్మతులు పూర్తయితే విద్యార్థినులకు తరగతులు కొనసాగుతాయి, లేకుంటే సెలవులు పొడిగించాల్సిందే.

**పత్తాలేని లెక్చరర్లు..**

పాఠశాలలో పనిచేస్తూ స్థానికంగా ఉంటున్న ఇద్దరు సిబ్బందికి బాధ్యతలు అప్పగించి లెక్చరర్లు చేతులు దులుపుకున్నారనే ఆరోపణలున్నాయి. కళాశాలలో ఆరుగురు లెక్చరర్లు పనిచేస్తున్నారు. అయితే జూన్ 1నుంచి అడ్మిషన్లు ప్రారంభం కావాల్సి ఉండగా సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించక పోవడంతో కళాశాలలో కొనసాగుతున్న సీఈసీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఒకేషనల్ కోర్సుల గురించి ప్రచారం చేయడంలేదని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం 11గంటల వరకు కళాశాలకు చెందిన సిబ్బంది, ప్రిన్స్‌పాల్ విధులకు రాలేదు. ఈ విషయంపై కంప్యూటర్ ఆపరేటర్‌ను ప్రశ్నిస్తే బస్సులో వస్తున్నారని అందుకు ఆలస్యం అవుతుందని చెప్పడం గమనార్హం. అధికారులు స్పందించి ఈ కళాశాల, పాఠశాల సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఎంపీలకు పలువురి శుభాకాంక్షలు

నర్సాపూర్: రాష్ట్రానికి చెందిన పలువురు బీజేపీ ఎంపీలను స్థానిక బీజేపీ నాయకులు ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సాపూర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, మెదక్ పార్లమెంటు కోకన్వీనర్ శ్రీనివాస్, నియోజకవర్గ పార్టీ కోకన్వీనర్ సతీశ్‌యాదవ్ తదితరులు ఢిల్లీలో ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, బండి సంజయ్ తదితరులను కలిసి శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీ రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకులు

# ప్రమోషన్ల వివరాలు వెల్లడిస్తాం

- డీఈఓ రాధాకిషన్
- సర్టిఫికెట్ల పరిశీలన



డీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల సందడి

మెదక్ కలెక్టరేట్: రెండు రోజుల్లో స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు, ప్రమోషన్ల వివరాలు వెల్లడిస్తామని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయం కిటకిటలాడింది. ప్రభుత్వ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ)గా కొనసాగుతున్న భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలను పీడీలుగా ప్రమోషన్ కల్పించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలోని 80మంది తెలుగుభాషా పండితులు, 64మంది హిందీభాషా పండితులు, 52మంది పీఈటీలు తరలిరాగా వారి సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. రాధాకిషన్ మాట్లాడుతూ ఆదివారం మరికొంతమంది సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్టు చెప్పారు.

# లోక్ అదాలత్‌లో సామరస్య పరిష్కారం




మాట్లాడుతున్న జడ్జి అనిత

- జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్: లోక్ అదాలత్‌లో సామరస్యంగా పరిష్కారం దొరుకుతుందని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయం వృథా అవుతుందనుకునే రెండు వర్గాలు కూర్చుని సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. లోక్ అదాలత్ తీర్పును హైకోర్టులో అప్పీలు చేయడానికి ఆస్కారం ఉండదని చెప్పారు. సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు మండల లీగల్ సర్వీస్ కమిటీని ఆశ్రయించి ఉచితంగా న్యాయ సలహాలు పొందవచ్చని జడ్జి అనిత సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ రాఘవేంద్ర, ఏజీపీ సత్యనారాయణ, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ మధుశ్రీ, లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూప, న్యాయవాదులు శ్రీధర్‌రెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్, ఎక్సైజ్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# జోరుగా చేపల విక్రయాలు



తూప్రాన్‌లో చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు

- గ్రామాల్లో మృగశిర కార్తె సందడి

వెల్దుర్తి(తూప్రాన్): మృగశిర కార్తె సందర్భంగా చేపలు తినడం పూర్వకాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. ఈ రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని ప్రజల విశ్వాసం. దీనికితోడు ఇదే రోజు చేప ప్రసాదం పంపిణీ చేస్తుండడంతో చేపలు తినడానికి అనేక మంది ఆసక్తి కనబరుస్తారు. దీంతో మార్కెట్‌లో పలు రకాల చేపలకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. మామూలు రోజుల కన్నా మృగశిర కార్తె రోజు అమ్మకాలు అధికంగా జరిగాయని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

**చిలప్‌చెడ్(నర్సాపూర్)లో..**

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో మృగశిర కార్తె పురస్కరించుకుని శనివారం జోరుగా చేపల విక్రయాలు కొనసాగాయి. ప్రజలు భారీగా చేపలు కొనుగోలు చేశారు. మాములు రోజులలో రౌట, బంగారుతీగ, బొచ్చె, గ్యాస్కట్ లాంటి చేపలు కిలోకు రూ.100నుండి 120వరకు ఉండగా శనివారం రూ.150 నుంచి 200 వరకు, కొర్రమీను కిలోకు రూ.300 నుండి రూ.500 వరకు ధరలు పలికాయి.

**కౌడిపల్లి(నర్సాపూర్‌లో..**

కౌడిపల్లి మార్కెట్‌లో మృగశిర కార్తె సందర్భంగా కిలో రూ 500నుంచి రూ.600 వరకు అమ్మగా తెల్లరకం చేపలు కిలో రూ.160నుంచి రూ 200వకు విక్రయించారు.

**నర్సాపూర్ రూరల్‌లో..**

మృగశిర కార్తె సందర్భంగా నర్సాపూర్ పట్టణంలోని ప్రధాన రహదారిపై చేపల విక్రయాలు జోరుగా సాగాయి. మీర్గం రోజు చాలామంది చేపలు తినడం ఆనవాయితీ. చేపల వ్యాపారులు దీన్ని ఆసరా చేసుకుని రేట్లు ఒకసారిగా పెంచారు. శనివారం కావడంతో చాలామంది చేపలను కొనేందుకు ముందుకు రాలేదని వ్యాపారాలు వాపోయారు.

**మృగశిర కార్తె చేపల మార్కెట్ సందడి**

చేగుంట(తూప్రాన్): మృగశిర కార్తె సందర్భంగా చేగుంటలో చేపల మార్కెట్‌లో సందడి నెలకొంది. మృగశిర కార్తె రోజున చేపలను తినడంతో ఆరోగ్యం బాగుంటుదని అనాదిగా నమ్మకం ఉంది.



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు

దీంతో శనివారం మృగశిర కార్తె ఉండటంతో చేపల మార్కెట్‌లో కొనుగోలుదారులతో మార్కెట్‌లో సందడి నెలకొంది. రకాలనుబట్టి కిలో వంద నుండి నాలుగు వందల వరకు చేపల విక్రయాలు జరుపుతున్నట్లు గంగపుత్రులు తెలిపారు.

**గ్రామాల్లో సందడి**

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మృగసిర కార్తె సందర్భంగా సందడి నెలకొంది. రైతులు ఉదయమే పంటపొలాల్లో దుక్కులు దున్ని పూజలు నిర్వహించారు. మరోవైపు చేపల కోసం ప్రజలు చెరువుల బాట పట్టారు. చెరువుల్లో తాజాగా అప్పుడే పట్టిన చేపలను తీసుకువెళ్లేందుకు స్థానికులు ఉత్సాహం చూపారు. మృగసిర కార్తె రోజున చేపలను తినాలనే సెంటిమెంట్‌తో చాల వరకు చేపలను తీసుకువెళ్లారు.

**తూప్రాన్‌లో..** మృగశిర కార్తె రోజు కావడంతో శనివారం మార్కెట్లో చేపలకు డిమాండ్ పెరిగింది. చేపలను కొనేందుకు ప్రజలు బారులు తీరారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పట్టణానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాధారణ రోజులతో పోలిస్తే ధరలు ఎక్కువైనప్పటికీ ప్రజలు కొనుగోలు చేయడానికి వెనుకాడలేదు.



నర్సాపూర్ రూరల్‌లో...

### పశుగ్రాసం అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి ఆలయ పరిధిలో ఉన్న గోశాలకు ఎదుల్లాపూర్‌కు చెందిన కల్లూరి రాజు శనివారం 100మోపుల ఎండు గడ్డిని అందజేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ గోశాలలో పశుగ్రాసం కొరత ఉందని దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### కొత్త చెరువులో వ్యక్తి మృతదేహం

తూప్రాన్: పట్టణంలోని కొత్త చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్ఐ శివానందం శనివారం తెలిపారు. సంగారెడ్డికి చెందిన నర్సింహులు మరో ఇద్దరితో కలిసి చేపలవేటకు వెళ్లి శుక్రవారం గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి కావడంతో శనివారం గాలింపు చేపట్టి మృత దేహాన్ని వెలికితీసినట్లు ఎస్ఐ చెప్పారు. మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని తెలిపారు.



నర్సింహులు మృతదేహం

# ‘గుండువాగు’తో 4లక్షల ఎకరాలకు నీరు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

టేక్మాల్(మెదక్): సింగూరు ప్రాజెక్టు నీరును టేక్మాల్ మండలంలోని గుండువాగులో కలిపి అల్లాదుర్గం, టేక్మాల్, పాపన్నపేట్ మండలాలకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. శనివారం టేక్మాల్‌లో ఆయన మాట్లాడుతూ గుండు వాగు ప్రాజెక్ట్ ద్వారా సుమారు నాలుగు లక్షల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉందని, మూడు మండలాల్లోని రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. 2017లో ఈ ప్రాంతంలో సింగూరు కలపాలని తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేశామన్నారు. దాని ఫలితంగా పుల్కల్ అందోల్ చెరువులను నింపి అక్కడ కాల్వలకు సిమెంట్ లైనింగ్‌కు రూ.1.68 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో మల్లేశం, సంతోష్, విజయ్, కరుణాకర్, అరుణ్, అశోక్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు మల్లేశం

# కుటుంబ కలహాలతో..

**ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య**

పెద్దశంకరంపేట(మెదక్): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దశంకరంపేటలోని ఇందిరాకాలనీలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పేటకు చెందిన నాందేడ్ యాదగిరి(31) వృత్తి రీత్యా డ్రైవర్. అతడికి భార్య నాందేడ్ ఉష, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. యాదగిరి తరుచూ మద్యం సేవించి గొడవపడుతుండడంతో కొద్ది రోజుల కిందట భార్య పిల్లలతో తల్లిగారి ఇంటికి వెళ్లింది. రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులమంతా కలిసి ఉందామని చెప్పడంతో ఇంటికి వచ్చింది. మళ్లీ శుక్రవారం రాత్రి యాదగిరి మద్యం సేవించి భార్యతో గొడవపెట్టుకోవడంతో కుటుంబ సభ్యులు సముదాయించారు. యాదగిరి మరో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకొన్నాడు. ఉదయమైనా గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టగా దూలానికి ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి భార్య ఉష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



యాదగిరి(ఫైల్)

**అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..**

తూప్రాన్: పట్టణ పరిధి వెంకటాపూర్(పీటీ) గ్రామంలోని బస్టాప్‌లో బెంచీపై శనివారం అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెంది కనిపించాడు. అయితే వృద్ధుడి మెడకు తాడు బిగించి ఉందని ఎస్ఐ శివానందం శనివారం తెలిపారు. సుమారు (60) ఏళ్లకు పైబడిన గుర్తు తెలియని వృద్ధుడిగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.



గుర్తు తెలియని వృద్ధుడు

# ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన బోధన

- ఉత్తమ ఫలితాలు సాధించాం
- ప్రిన్సిపాల్ నాగేందర్

చిన్నశంకరంపేట(మెదక్): మెరుగైన బోధన ప్రభుత్వ కళాశాలల్లోనే సాధ్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.నాగేందర్ అన్నారు. శనివారం ఆయన అధ్యాపకులతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాలలో చేరాల్సిందిగా అభ్యర్థించారు. ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల జిల్లాలోనే టాపర్‌గా నిలిచిందని గుర్తుచేశారు. బైపీసీ, ఎంపీసీ ఆంగ్లం, తెలుగు మీడియంలో బోధిస్తున్నామని తెలిపారు. హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఈసీతో పాటు ఇతర ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందవచ్చని వివరించారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలను పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని చిన్నచింతకుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగుల్ మీరా కోరారు. శనివారం బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, అర్హులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, ఇంగ్లిష్ మీడియం విద్యను సైతం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, రంజిత్, కార్యదర్శి లక్ష్మణ్, గ్రామస్తులు విఠల్, సీతయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామల్లో సైతం బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

**కొల్చారం(నర్సాపూర్)లో..**

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పేందుకు అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మీ నర్సింహులు ఆధ్వర్యంలో సంగాయిపేట గిరిజన తండా, రాంపూర్ గ్రామంలో అంగన్వాడీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఉన్నత పాఠశాలలో మధ్యలో చదువు ఆపేసిన నలుగురు విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇప్పించారు. రాంపూర్‌లో విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం సుశీల్వ, పంచాయత కార్యదర్శి నాగరత్న, పాఠశాల హెచ్‌ఎం శ్రావణి, అంగన్వాడీ టీచర్లు మంగ, స్వరూప, హైమావతి, లింగమణి, వీఏఓలు పాల్గొన్నారు.

**కౌడిపల్లి(నర్సాపూర్)లో..**

మండలంలోని వివిధ గ్రామాలు, తండాల పాఠశాలల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. మండలంలోని దయ్యాల తండాలో హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో తండాలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులను తండా పాఠశాలలో చేర్పించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.



కొల్చారం(నర్సాపూర్): అడ్మిషన్ పత్రాలను అందజేస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనర్సింహులు



చిన్నశంకరంపేటలో విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ నాగేందర్



కౌడిపల్లి(నర్సాపూర్) దయ్యాల తండాలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు